

ఆశ్రమంలో చేరికకు ఆసక్తి

గతంలో తల్లిదండ్రులతో కలసి కొండపోడు పనులు, పశువుల కాపలాకు వెళ్లిన గిరిజన విద్యార్థులు ఇప్పుడు పాఠశాలల బాట పడుతున్నారు.

- 8లో



పోలీసుల సంక్షేమమే లక్ష్యం

విజయనగరం క్రైమ్: ఉద్యోగ విరమణ పొందిన హోమ్‌గార్డు ఎ.సోమయ్యకు హోంగార్డులు సమకూర్చిన రూ.3,80,080ల చెక్కును ఎస్పీ దీపిక శుక్రవారం అందజేశారు.

వెబ్‌సైట్‌లో మెరిట్ జాబితా

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న రీసెర్చ్ అసిస్టెంట్ పోస్టుకు కొద్ది రోజుల కిందట నిర్వహించిన ఇంటర్వ్యూకు 12 మంది హాజరయ్యారు. మెరిట్ జాబితాను విజయనగరం.ఎన్ఐసి.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలు

విజయనగరం: విజయగనరం వేదికగా రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలు రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్టు జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు డి.వి.చారీప్రసాద్ తెలిపారు. నగరంలోని రాజీవ్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 15,16 తేదీల్లో జరిగే పోటీలను ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రారంభిస్తారన్నారు. క్యాడెట్ విభాగంలో నిర్వహించే పోటీల్లో రాష్ట్రం నలుమూలల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు 16వ తేదీన బహుమతులు ప్రదానం చేస్తామని చెప్పారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభకనబరిచిన క్రీడాకారులను ఈ నెల 26, 27, 28 తేదీల్లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోలో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

16న జాబ్‌మేళా

విజయనగరం రూరల్: జిల్లా కేంద్రంలోని ఎంఆర్ అటానమస్ కళాశాలలో ఈ నెల 16న జాబ్‌మేళా నిర్వహిస్తామని జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.అరుణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరామ్ ఫైనాన్స్, టాటా కాపిటల్ మైక్రో ఫైనాన్స్, స్మార్ట్ సర్వీసెస్ (పేటీఎం), టెక్ మహీంద్ర, ఎస్‌బీఐ కార్డ్స్ వంటి సంస్థల్లో 350 ఉద్యోగాలకు అభ్యర్థుల ఎంపిక జరుగుతుందన్నారు. 18–30 ఏళ్ల లోపు వయస్సు వారై ఏదైనా డిగ్రీ, ఇంటర్, బీఫార్మసీ కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని, అభ్యర్థులు వారి ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

ఆధార్ అనుసంధానం తప్పనిసరి

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు కళాశాలల్లో ఇంటర్మీడియట్ చదువుతున్న షెడ్యూల్ కులాల విద్యార్థులు అమ్మఒడి పథకానికి సంబంధించి బ్యాంకు ఖాతాలకు ఆధార్‌ను తక్షణమే అనుసంధానం చేసుకోవాలని సోషల్‌వెల్ఫేర్ డీడీ పి.రత్నం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 1591 మంది విద్యార్థులు బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేసుకోలేదన్నారు. అమ్మఒడి పథకం నిధులు ఖాతాల్లో జమకావాలంటే ఆధార్‌అనుసంధానం తప్పనిసరన్నారు.

ఎడ్‌సెట్‌లో పనసపేట విద్యార్థికి ఫస్ట్ ర్యాంకు



సింగుపురపు బలరాంనాయుడు

రాజాం/సంతకవిటి: సంతకవిటి మండలం పనసపేట గ్రామానికి చెందిన సింగుపురపు బలరాంనాయుడు ఏపీ ఎడ్‌సెట్‌లో సోషల్‌స్టడీస్ విభాగంలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించాడు. 150 మార్కులకు 98 మార్కులు వచ్చాయి. సివిల్ కానిస్టేబుల్‌గా రెండేళ్లపాటు పనిచేసి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. ప్రస్తుతం గ్రూప్–1 పరీక్షకు సిద్ధమవుతున్నారు. జిల్లా కోర్టులో ఒక ఉద్యోగాన్ని ఎంపికైనా చేరలేదు. బలరాంనాయుడు తల్లిదండ్రులు అనసూయమ్మ, ధర్మారావు రైతు కుటుంబీకులు. పేద ప్రజలకు సేవ చేసేలా ఉన్నత ఉద్యోగ సాధనే లక్ష్యమని బలరాంనాయుడు 'సాక్షి'కి తెలిపారు.

వాయుసేనలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం: భారత వాయుసేనలో అగ్నిపథ్ పథకం కింద ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్/డిప్లమో పూర్తి చేసుకున్న అవివాహిత పురుష, మహిళ భారతీయ అభ్యర్థులు ఈ నెల 27 నుంచి వచ్చేనెల 17వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. సైన్స్ విభాగాల ఉద్యోగాలకు ఇంటర్మీడియట్ ఎంపీసీలో 50 శాతం మార్కులు, మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/ఆటోమొబైల్స్/ కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌తో మూడేళ్ల డిప్లమో కోర్సులో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. రెండేళ్ల ఒకేషనల్ కోర్సులో ఉత్తీర్ణులైన వారు కూడా అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు 2003 జూన్ 27 నుంచి 2006 డిసెంబర్ 27వ తేదీల మధ్య జన్మించి, 152.5 సెంటీమీటర్ల ఎత్తు, ఎత్తుకు తగిన బరువు, గాలి పీల్చినపుడు ఛాతి 5 సెంటీమీటర్ల వ్యాకోచం చెందాలన్నారు. అక్టోబర్ 13న ఆన్‌లైన్‌లో నిర్వహించిన రాత పరీక్షలో ప్రతిభ చూపిన వారికి ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. విజయనగరం, పార్వతీపురం–మన్యం జిల్లాల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని కోరారు.

టీకాలు వేయడంపై ప్రత్యేక శ్రద్ధ

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో ఐదేళ్లలోపు పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు వేయడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు వైద్యాధికారులకు సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం మిషన్ ఇంద్ర ధనుష్ కార్యక్రమంపై పీహెచ్‌సీ వైద్యాధికారులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీఐఓ అచ్చుతకుమారి పాల్గొన్నారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో బంగారు 'బాబు'

- తండ్రి స్ఫూర్తితో రాణింపు

నెల్లిమర్ల రూరల్: ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో ఈ నెల 12 నుంచి జరుగుతున్న అంతర్జాతీయ కామన్‌వెల్త్ యూత్ చాంపియన్‌షిప్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన వెయిట్ లిఫ్టర్లు సత్తా చాటుతున్నారు. నెల్లిమర్ల మండలంలోని కొండవెలగాడ గ్రామానికి చెందిన వల్లూరు అజయ్‌బాబు శుక్రవారం 81 కేజీల విభాగంలో పోటీల్లో క్లీన్ అండ్ జెర్క్‌లో 168 కేజీలు, స్నాచ్‌లో 141 కేజీలు మొత్తంగా 309 కేజీల బరువును ఎత్తి స్వర్ణ పతకాన్ని దక్కించుకున్నాడు. తండ్రి వల్లూరు శ్రీనివాసరావు గతంలో కామన్‌వెల్త్ గేమ్స్‌లో దేశం తరఫున ప్రాతినిథ్యం వహించి



మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం అందుకుంటున్న వెయిట్ లిఫ్టర్ వల్లూరు అజయ్‌బాబు

కాంస్య పతకం సాధించారు. తండ్రి స్ఫూర్తితో అజయ్‌బాబు సాధన చేస్తూ జాతీయ, అంతర్జాతీయ వేదికలపై రాణిస్తున్నాడు. త్వరలో జరగనున్న కామన్‌వెల్త్ గేమ్స్‌లో స్వర్ణం సాధించడమే



తల్లిదండ్రులతో స్వర్ణ పతక విజేత వల్లూరు అజయ్‌బాబు

తన లక్ష్యమని అజయ్ తెలిపాడు. చాంపియన్‌షిప్ పోటీల్లో సత్తాచాటడంతో తల్లిదండ్రులతో పాటు క్రీడాభిమానులు, ఆర్టీసీ రీజనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు సన్యాసినాయుడు అభినందనలు తెలిపారు.

ఏపీ పీజీసెట్‌లో ర్యాంకుల పంట

- పలు సబ్జెక్టుల్లో టాప్‌టెన్‌లో ఉమ్మడి విజయనగరం జిల్లా అభ్యర్థులు

విజయనరం అర్బన్: ఆంధ్రయూనివర్సిటీ నిర్వహించిన ఏపీ పీజీసెట్–2023 ప్రవేశ పరీక్షల ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. ఇందులో పలు సబ్జెక్టుల్లో ఉమ్మడి విజయనగరం జిల్లా విద్యార్థులు టాప్ టెన్‌లో నిలిచారు. జియాలజీ సబ్జెక్టులో ఐదుగురు, తెలుగు సబ్జెక్టులో నలుగురు, మ్యాథ్‌మెటిక్స్, ఎలక్ట్రానిక్స్, కెమికల్ సబ్జెక్టులలో ఇద్దరేసి, ఎడ్యుకేషన్, లైఫ్ సబ్జెక్టులలో ఒక్కొక్కరు టాప్ టెన్‌లో ర్యాంకులు సాధించారు. సబ్జెక్టువారీ ర్యాంకర్ల వివరాలు ఇలా ఉన్నాయి.

ర్యాంకర్లు వీరే..

మ్యాథ్స్ సబ్జెక్టులో వై.సాగర్ (కె.ఎల్.పురం, విజయనగరం)కు మొదటి, రొంపల్లి వాసుదేవరావు (నిడగళ్లు, సీతానగరం మండలం, పార్వతీపురం మన్యం) రెండవ ర్యాంకు సాధించారు. ఎలక్ట్రానిక్స్ సబ్జెక్ట్‌లో సుంకరి బాలామణి (బిత్రపాడు, జియ్యమ్మవలస)



వై.సాగర్ (మ్యాథ్స్-1వ ర్యాంక్)



రొంపల్లి వాసుదేవ రావు (మ్యాథ్స్-2వ ర్యాంక్)



సుంకరి బాలామణి (ఎలక్ట్రానిక్స్‌లో 1వ ర్యాంక్)

మొదటి ర్యాంకు, కంకనల సాయిసుధీర్ మూడో ర్యాంకును సొంతం చేసుకోగా, జియాలజీ సబ్జెక్టులో పాలెపు హరీష్- 2వ ర్యాంకు, శ్రీరామ రాధిక-3, కళ్యాణపు రవి-7, డి.గౌతమి-9, పూసపాటి సత్యశ్రీ 10వ ర్యాంక్ సాధించారు. తెలుగులో మండల రోజా-4వ ర్యాంకు, తిరుపతి యమున-5, మంతిని శ్రావణి-9, వంగపండు యమునకు-10వ ర్యాంకు లభించాయి. కెమికల్ సబ్జెక్టులో గుండు ఖ్యాతి-6, కోసూరు సత్య దివ్య 7వ ర్యాంకు సాధించారు. ఎడ్యుకేషన్ సబ్జెక్టులో కోట్ల పాపినాయుడు-10, లైఫ్‌సైన్స్‌లో నక్కిన చరిత 5వ ర్యాంకును సొంతం చేసుకున్నారు.

నోరూరించే మన్యం రుచులు

చిరు ధాన్యాలతో తయారు చేసిన ఉత్పత్తులకు సంప్రదించాల్సిన యూనిట్ నిర్వాహకుల నంబర్లు	కుండింగి సాయికుమారి: 93989 35807
	యొజ్జు పార్వతి: 77029 91472
	ఆన్‌లైన్‌లో: ఆమోదం బ్రాండ్

కనుచూపు మేర కనిపించే పచ్చని కొండలు.. విశాలమైన అటవీ ప్రాంతం పార్వతీపురం మన్యం జిల్లా సొంతం. ఇక్కడి కొండపోడులో సేంద్రియ పద్ధతుల్లో గిరిజన రైతులు సాగుచేసే చిరుధాన్యాలు ఆరోగ్యకరం. అందుకే బహిరంగ మార్కెట్‌లో గిరాకీ ఉంది. అవే చిరుధాన్యాలతో గిరిజన మహిళలు ప్రత్యేక యూనిట్లు ఏర్పాటుచేసి ఆరోగ్యకర ఆహార పదార్థాలను తయారు చేస్తున్నారు. దేశ వ్యాప్తంగా ప్రధాన కూడళ్లలో స్టాల్స్‌ను ఏర్పాటుచేసి నోరూరించే ఉత్పత్తులను ప్రజలకు చౌకగా అందిస్తున్నారు. ఐటీడీఏ సహకారంతో యూనిట్లను విస్తరింపజేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మన్యంలో తయారు చేస్తున్న 'చిరు' ఉత్పత్తులు, విక్రయాలకు 'సాక్షి' అక్షర రూపం.

- ఏజెన్సీలో సేంద్రియ పద్ధతుల్లో సాగుచేసిన చిరుధాన్యాలతో ఆరోగ్యకర ఆహారపదార్థాల తయారీ
- విరివిగా విక్రయాలు
- రైల్వే, బస్‌స్టేషన్లు, ప్రధాన కూడళ్లలో స్టాల్స్
- ఆరోగ్యకర ఉత్పత్తులకు రోజురోజుకూ పెరుగుతున్న డిమాండ్
- 'ఆమోదం' బ్రాండ్‌తో ఆన్‌లైన్‌లో అమ్మకాలు
- చౌకగా ఆరోగ్యకర ఉత్పత్తులు లభ్యం
- గిరిజన మహిళలే ఉత్పత్తిదారులు
- తోడ్పాటునందిస్తున్న ఐటీడీఏ





పార్వతీపురం జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన చిరుధాన్యాలతో తయారుచేసిన తినుబండారాల స్టాల్స్



పార్వతీపురం కలెక్టర్ కార్యాలయం వద్ద మిల్లెట్ స్టాల్

విజయనగరం డెస్క్:

ప్రస్తుత సాంకేతిక యుగంలో ప్రతి ఒక్కరిదీ ఉరుకులపరుగుల జీవనం. సరైన ఆహారం తీసుకోకపోవడం, వ్యాయామానికి దూరం కావడంతో అనారోగ్యానికి గురవుతున్నారు. రసాయన ఎరువులతో పండించిన పంటలు కూడా ప్రజల ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతున్నాయన్నది వైద్యుల మాట. అందుకే సేంద్రియ పద్ధతుల్లో పండించే చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహారపదార్థాలను తీసుకోవాలని పదేపదే చెబుతున్నారు. దేశ ప్రజల అవసరాలకు అనుగుణంగా చిరుధాన్యాల సాగును సైతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. మద్దతు ధర కల్పనతో పాటు విత్తనాలను ఉచితంగా, రాయితీపై సరఫరా చేస్తున్నాయి. ఐక్యరాజ్య సమితి సైతం 2023 సంవత్సరాన్ని మిల్లెట్స్ ఇయర్‌గా ప్రకటించడంతో దీనిపై మరింత ప్రత్యేక దృష్టిసారించాయి. ప్రభుత్వాల సహకారాన్ని పార్వతీపురం మన్యం జిల్లాలోని గిరిజన సంఘాల మహిళలు (వన్‌ధన్ వికాస కేంద్రాలు) అందిపుచ్చుకుంటున్నారు. స్థానికంగా లభ్యమయ్యే చిరుధాన్యాలతో (రాగులు, కొర్రలు, జొన్నలు, మిక్స్‌డ్ గ్రెస్ట్, ఊదలు, సామలు, గంటిలు తదితరవి) వినియోగదారులు నోరూరించే ఆహార పదార్థాలను తయారు చేస్తున్నారు. ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటుచేసి విక్రయిస్తున్నారు. వీరికి కలెక్టర్‌తో పాటు ఐటీడీఏ అధికారులు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తుండడంతో వ్యాపారాన్ని మరింత ముందుకు సాగించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

తయారీ ఎక్కడ?

- సీతంపేట ఐటీడీఏ పరిధిలో ముక్కుడు పోలమ్మ (వీడీవీకే) కార్యాలయంలో మిల్లెట్స్ ఉత్పత్తుల తయారు కేంద్రం ఉంది.
- మిల్లెట్స్‌తో ఆహార పదార్థాల తయారీలో ఇక్కడి మహిళలు సీతంపేట ఐటీడీఏ సహకారంతో ఐఐటీ కాన్పూర్ ఆధ్వర్యంలో శిక్షణ పొందారు. రుచికరమైన వంటకాల తయారీలో ట్రైనర్ శ్రీనివాసరావు శిక్షణ ఇచ్చారు.

ఆదాయం

- ఒక్కో వన్‌ధన్ వికాస కేంద్రం ద్వారా ప్రస్తుతం నెలకు రూ.50 వేల విలువైన ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. దీనివల్ల రూ.15 వేల వరకు ఆదాయం ఆర్జిస్తున్నారు.
- వీరు తయారు చేస్తున్న సరుకులు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, పార్వతీపురం మన్యం జిల్లాలతో పాటు ఢిల్లీ, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. స్థానిక దుకాణాలకు సైతం విక్రయిస్తున్నారు.
- మార్కెటింగ్, వీడీకేల అభివృద్ధికి ఐటీడీఏ సహకారం అందిస్తోంది.

తయారు చేస్తున్న తినుబండారాలు

- ఆహార పదార్థాల తయారీకి ప్రధాన ముడిసరుకుగా గిరిజన రైతులు పూర్తిగా సేంద్రియ పద్ధతుల్లో పండించే కొర్రలు, రాగులు, జొన్నలు, మిక్స్‌డ్ గ్రెస్ట్, ఊదలు, సామలు, గంటిలు తదితర చిరుధాన్యాలు వినియోగిస్తున్నారు.
- కొర్ర జంతికలు, కొర్ర లడ్డూ, మల్టీగ్రెయిన్ బిస్కెట్స్, మల్టీ గ్రెయిన్ లడ్డూలను (మార్కెట్‌లో డిమాండ్ మేరకు) తయారు చేస్తున్నారు.
- ఒక్కో ప్యాకెట్‌లో 12 బిస్కెట్స్ చొప్పున బాక్స్‌లో 24 ఉంటాయి. చిరుధాన్యం రకాన్ని బట్టి రూ.30 నుంచి రూ.120కు విక్రయిస్తున్నారు.



ప్రాసెసింగ్ యూనిట్‌లో మల్టీగ్రెయిన్ బిస్కెట్లు తయారుచేస్తున్న మహిళలు

ఐటీడీఏ ప్రోత్సాహంతో..



ఐటీడీఏ ప్రోత్సాహంతో మిల్లెట్స్‌తో తినుబండారాల తయారీపై హైదరాబాద్‌లో శిక్షణ పొందాను. నేను నేర్చుకున్న విధానంపై స్థానికంగా పలువురు గిరిజన మహిళలకు అవగాహన కల్పిస్తున్నాను. 2022లో నలుగురు మహిళలం చిరుధాన్యాలతో తినుబండారాల తయారీ యూనిట్ ప్రారంభించాం. నెలకు రూ.50వేల నుంచి రూ.70 వేల విలువైన సరుకులు సిద్ధం చేసి అమ్మకాలు చేపడుతున్నాం. రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఆదాయం వస్తోంది. కొర్రలు, మల్టీగ్రెయిన్ మిల్లెట్స్‌తో తయారుచేస్తున్న లడ్డూలు, బిస్కెట్లు, జంతికలకు మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉంది. ఇవి పూర్తి ఆరోగ్యకరమైనవి.

– కండంగి సాయి కుమారి, మల్టీగ్రెయిన్ తినుబండారాల తయారీదారు, అత్తికొత్తూరు, భామిని మండలం

ఆరోగ్యకర ఆహారం



చిరుధాన్యాలతో తయారు చేసే ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు చేకూరుస్తాయి. చిరుధాన్యాల్లో పిండి పదార్థంతో పాటు ప్రొటీన్లు, పీచు పదార్థం, ఇనుము, కాల్షియం, సూక్ష్మ పోషకాలు అధికంగా ఉంటాయి. పొట్టు తీసిన కొవ్వు కాస్త ఉంటుంది. ఇది కూడా ఆరోగ్యానికి మంచిదే. వీటివల్ల మానవ శరీరంలో జీర్ణ ప్రక్రియ మెరుగుపడుతుంది. శరీరంలో ఆమ్లస్థాయి తగ్గించేందుకు దోహదపడతాయి. కడుపులో ఇబ్బంది, అల్సర్ వంటివి తలెత్తవు. పిల్లల, వృద్ధులకు ఆరోగ్యకర ఆహారం ఇది.

– డా.బి.వాగ్దేవి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్, పార్వతీపురం

చిరుధాన్యాల పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నాం



చిరుధాన్యాల ప్రాసెసింగ్, ఆహార పదార్థాల తయారీ పరిశ్రమలను ప్రోత్సహించే చర్యలు చేపట్టాం. ప్రజలకు ఆరోగ్యకర ఆహారం అందించడంలో భాగంగా సీతంపేట వన్‌ధన్‌వికాస్ కేంద్రం ద్వారా చిరుధాన్యాల ఉత్పత్తుల తయారీని ప్రోత్సహిస్తున్నాం. అక్కడ తయారైన మిల్లెట్ బిస్కెట్లను విక్రయించేందుకు స్టాల్స్ ఏర్పాటుకు సహకరిస్తున్నాం. కలెక్టర్ కార్యాలయంలో విజయవంతంగా స్టాల్‌ను నిర్వహిస్తున్నాం. ఉత్పత్తులను మార్కెటింగ్ చేసేందుకు వీడీవీకేలలో గిరిజన మహిళలకు శిక్షణ ఇస్తున్నాం. భవిష్యత్తులో ఇక్కడి నుంచి చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహారపదార్థాలు దేశవ్యాప్తంగా సరఫరా చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

– నిషాంత్‌కుమార్, కలెక్టర్, పార్వతీపురం మన్యం

వినియోగం పెరిగింది



ఆరోగ్య పరిరక్షణలో భాగంగా చిరుధాన్యాలతో తయారుచేస్తున్న తినుబండారాల వినియోగం ఇప్పుడిప్పుడే పెరిగింది. బహిరంగ మార్కెట్‌లో గిరాకీ లభిస్తోంది. మార్కెటింగ్‌పై మహిళలకు అవగాహన కల్పిస్తున్నాం. రాగిజావ పిండి, మల్టీ గ్రెయిన్ పిండితోపాటు, లడ్డూలు, బిస్కెట్లు, జంతికలు ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు, ఇతర ప్రాంతాలకు మార్కెటింగ్ చేస్తున్నాం. వినియోగదారులు, దుకాణదారుల ఆర్డర్ మేరకు సరుకులు తయారు చేస్తున్నాం. రానున్న రోజుల్లో వినియోగదారుల అవసరం మేరకు జిల్లావ్యాప్తంగా యూనిట్లను విస్తరింపజేస్తాం.

– వై.పార్వతి, మార్కెటింగ్ నిర్వాహకురాలు, సీతంపేట మండలం

కేసుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారంలో అధికారులు, పోలీసులు ప్రత్యేక చొరవ చూపాలని, బాధితులకు సకాలంలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి.ఎస్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఎస్పీ దీపికా ఎం.పాటిల్, జేసీ మయూర్ అశోక్, ఇతర అధికారులతో కలిసి పాల్గొన్నారు. సాంఘిక సంక్షేమ ఉప సంచాలకుల రత్నం సమావేశ అజెండాను వెల్లడించారు. గత సమావేశంలో వచ్చిన అంశాలు, తీసుకున్న చర్యలను వివరించారు. సమావేశంలో భాగంగా పలు అంశాలు చర్చకు వచ్చాయి. ఎస్సీ కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని, శ్మశాన వాటికలను ఏర్పాటు చేయాలని పలువురు విజ్ఞప్తి చేశారు. కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం సరిగ్గా అమలు కావడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ... పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని డీఈఓను కలెక్టర్ ఆదేశించారు. రాజాం పట్టణ పరిధిలో ఎస్సీ సామాజిక భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ కోసం సభ్యులు విజ్ఞప్తి చేయగా వివిధ విభాగాల్లో ఖాళీల వివరాలను సేకరించి నివేదిక అందజేయాలని సాంఘిక సంక్షేమ శాఖ డీడీని ఆదేశించారు. రాజాం పట్టణంలో గుడి, బడికి సమీపంలో మద్యం దుకాణాలు లేకుండా చూడాలని ఎక్సైజ్‌శాఖ అధికారులకు సూచించారు. డీఆర్వో ఎం.గణపతిరావు, విజయనగరం ఆర్డీఓ ఎం.సూర్యకళ, కమిటీ సభ్యులు భానుమూర్తి, శ్రీను, ఆర్.జయరావు పాల్గొన్నారు.

రామతీర్థం సిబ్బందికి మెమోలు

నెల్లిమర్ల రూరల్: అత్యుత్సాహం ప్రదర్శించిన రామతీర్థం దేవస్థాన సిబ్బందికి మెమోలు జారీ చేసినట్టు ఈఓ కిశోర్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 5న టీడీపీ ఆధ్వర్యంలో నెల్లిమర్ల పట్టణంలో టీడీపీ నేతలు బస్సు యాత్ర నిర్వహించారు. ఆ కార్యక్రమానికి కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు హాజరు కాగా, ఆయన్ను పూర్ణకుంభంతో ఆహ్వానం పలికేందుకు దేవస్థాన అర్చకులు, సిబ్బంది మూడుకిలోమీటర్ల దూరం వెళ్లారు. ఈ ఘటనపై 'గీత దాటిన రామతీర్థం అర్చకులు' అనే శీర్షికన ఈ నెల 6న 'సాక్షి'లో ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించి మెమోలు జారీ చేశారు.

'పవర్' చూపిన మహిళలు

రాజాం సిటీ: జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మహిళలు సత్తాచూపారు. అద్భుత ప్రదర్శనలతో చూపరులను అబ్బురపరిచారు. రాజాం జీఎంఆర్ స్పోర్ట్స్ అరేనాలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి మాస్టర్స్ ఎక్విప్డ్–2023 పోటీలు శుక్రవారం రెండోరోజు కొనసాగాయి. 40, 50, 60, 70 సంవత్సరాల విభాగంలో స్త్రీ, పురుషులకు రాష్ట్రాల వారీగా టీం చాంపియన్‌షిప్, బెస్ట్ వ్యక్తిగత లిఫ్టర్స్, ఓవరాల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు.

- పవర్ లిఫ్టింగ్ ఓవరాల్ చాంపియన్ మహారాష్ట్ర

ఇందులో 244 పాయింట్లతో ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను మహారాష్ట్ర సొంతం చేసుకోగా, 171 పాయింట్లతో కేరళ ద్వితీయస్థానంలోను, 145 పాయింట్లతో తమిళనాడు తృతీయస్థానంలో నిలిచాయి. విజేతలకు పవర్ లిఫ్టింగ్ ఇండియా ప్రెసిడెంట్ పీజే జోషఫ్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా డిప్యూటీ డైరెక్టర్ ఏక్తా విష్ణునోయ్, ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్, పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్, శశికుమార్, ధీరజ్‌కుమార్‌సింగ్, ఏపీ పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ప్రభాకరరావు, సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జోనల్ కార్యదర్శి కోటేశ్వరరావు తదితరులు బహుమతులు అందజేశారు.

బెస్ట్ లిఫ్టర్లు వీరే...

బెస్ట్‌లిఫ్టర్లుగా వివధ రాష్ట్రాలకు చెందిన స్త్రీ పురుషులను నిర్వాహకులు ఎంపిక చేశారు. వారిలో 40 సంవత్సరాల పురుషుల విభాగంలో పి.మహేంద్రన్



ఓవరాల్ చాంపియన్‌షిప్ విజేతలకు బహుమతి అందిస్తున్న పవర్ లిఫ్టింగ్ ఇండియా ప్రెసిడెంట్ పీజే జోషఫ్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా డిప్యూటీ డైరెక్టర్ ఏక్తా విష్ణునోయ్, తదితరులు

(తమిళనాడు), పప్పు (ఢిల్లీ), వెంకటేష్ ప్రభు (కర్నాటక)లు, స్త్రీల విభాగంలో డాక్టర్ శార్వారి ఇనమ్దార్ (మహారాష్ట్ర), మీనా శర్మ (మధ్యప్రదేశ్), బి.మధుసుగంతి (తమిళనాడు)లు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. 50 ఏళ్ల పురుషుల విభాగంలో కె.దయానంద్‌రెడ్డి(తమిళనాడు), గంటా వెంకటేశ్వర్లు (ఆంధ్రప్రదేశ్), బీహెచ్ మంజునాథ్ (కర్నాటక)లు, స్త్రీల విభాగంలో రుబీదాస్ (మహారాష్ట్ర), అనిందితదాస్ (అస్సాం), గీతాంజలి దస్తోర్ (మహారాష్ట్ర), 60 ఏళ్ల పురుషుల విభాగంలో కె.విజయరంగన్ (తమిళనాడు), సతీష్ మురళీక్‌ధర్ పటాడే (మహారాష్ట్ర), ఎస్.జయరామన్(తమిళనాడు), స్త్రీల విభాగంలో రీనా తారకన్ (కేరళ), డాక్టర్ పూర్ణ బర్డే (మహారాష్ట్ర)లు వరుస మూడుస్థానాల్లో నిలిచారు. 70 ఏళ్ల పురుషుల విభాగంలో సి.ప్రేమచంద్రన్ (కేరళ), సురేష్‌కుమార్ సోని (ఎం.పి), అబ్దుల్ అజీమ్‌సీసీ (కేరళ)లు విజేతలుగా నిలిచారు.

టీమ్ చాంపియన్‌షిప్ విభాగంలో....

40 ఏళ్ల పురుషుల విభాగంలో మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు, స్త్రీల విభాగంలో మహారాష్ట్ర, తమిళనాడు, మధ్యప్రదేశ్, 50 ఏళ్ల పురుషుల విభాగంలో మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు, స్త్రీల విభాగంలో మహారాష్ట్ర, కేరళ, అస్సాంలు వరుస మూడు స్థానాల్లో నిలిచాయి. 60 ఏళ్ల పురుషుల విభాగంలో మహారాష్ట్ర, తమిళనాడు, త్రిపుర, స్త్రీల విభాగంలో కేరళ, మహారాష్ట్రలు, 70 ఏళ్ల పురుషుల విభాగంలో తమిళనాడు, కేరళ, మధ్యప్రదేశ్ వరుస మూడుస్థానాల్లో చాంపియన్ షిప్‌ను సొంతం చేసుకున్నాయి.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: అగ్నిపథ్ పథకంలో అగ్నివీర్, వాయుసేనలో ఉద్యోగ నియామకానికి ఆన్‌లైన్ ద్వారా అవివాహిత పురుషులు, మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని యువజన సర్వీసుల శాఖ, సెట్విజ్, జిల్లా స్పోర్ట్స్ ఆథారిటీ అధికారి బి.రామ్‌గోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అగ్నివీర్(ఆర్మీ), అగ్నివీర్ వాయు(ఎయిర్‌ఫోర్స్)లో ఉద్యోగాలకు ఇంటర్మీడియెట్, డిప్లొమా పూర్తి చేసిన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 27 నుండి ఆగస్టు 17వరకు హెచ్‌టీటీపీఎస్://అగ్నిపథ్‌వాయు.సిడిఏసి.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

టీటీడీ ఆధ్వర్యంలో నీతికథల పోటీలు

విజయనగరం టౌన్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉభయ జిల్లాలో జిల్లా శాఖ ఆధ్వర్యంలో నీతికథల పోటీలను ఈ నెల 16, 17 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు టీటీడీ ప్రోగ్రాం అసిస్టెంట్ జె.శ్యామ్ సుందర్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం వాల్‌పోస్టర్లను టీటీడీ ఆవరణలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'కథ చెబుతావా... ఊ కొడతాం' పేరుతో స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఈ నెల 16న , పార్వతీపురం మన్యం జిల్లాలో కొమరాడ మండలం కోటిపాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 17న పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 94414 61076 నంబరును సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పీవీ నరసింహాచార్యులు, జి.తిరుపతిరావు, కావ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

చీపురుపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు జీఆర్‌పీ ఎస్‌ఐ చెల్లూరి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో రెండవ నంబరు ప్లాట్‌ఫాంలో శుక్రవారం మధ్యాహ్నం వాస్కోడిగామ రైలు కింద గుర్తు తెలియని వ్యక్తి పడి మృతి చెందినట్లు ఆయన తెలిపారు. మృతుడి 30 సంవత్సరాల వయస్సు కలిగి, గ్రీన్ రంగు షర్ట్, నీలి రంగు జీన్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 70132 73731 నంబరును సంప్రదించాలని కోరారు.

రైలు ఢీకొని...



గార్డు భోగీలో గాయాలతో ఉన్న ప్రసాదు

బొబ్బిలి: పట్టణంలోని ఫ్లైఓవర్ కింద నుంచి ఇందిరమ్మ కాలనీలోని తన ఇంటికి వెళ్లేందుకు ట్రాక్ దాటుతున్న పి.ప్రసాద్ అనే వ్యక్తిని రాయగడ – విజయవాడ పాసింజర్ రైలు ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. వెంటనే స్థానికులు, రైల్వే సిబ్బంది గుర్తించి క్షతగాత్రుడ్ని అదే ట్రైన్‌లోని గార్డు భోగిలో ఎక్కించి స్టేషన్‌కు తీసుకువచ్చారు. అక్కడి నుంచి 108 వాహనం ద్వారా బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం విజయనగరం తరలిస్తుండగా గజపతినగరం వద్ద మృతి చెందాడు. మృతుడి అన్న కుమారుడు సాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

విజయనగరం క్రైమ్: ఉరేసుకుని వివాహిత మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి రూరల్ పోలీసులు శుక్రవారం అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక వీటీ అగ్రహారం బీసీ కాలనీలో నివాసం ఉంటున్న హేమలత (19) భీమునిపట్టణం మద్దిలపేట గ్రామానికి చెందిన శంకరరావుతో గతేడాది నవంబరులో హైదరాబాద్‌లో ప్రేమ వివాహం చేసుకుంది. వీటీ అగ్రహారం బీసీ కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకుని పాస్ట్‌పుడ్ సెంటర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. ఇదిలా ఉంటే శంకరరావు మాజీ ప్రియురాలు షాపు వద్దకు మూడు రోజులుగా వస్తూ, హేళన చేస్తుండడంతో హేమలత మనస్తాపం చెంది గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కి ఉరేసుకుంది. ఇది గమనించిన స్థానికులు కొన ఊపిరితో ఉన్న ఆమెను కేంద్రాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె శుక్రవారం మృతి చెందింది. రూరల్ సీఐ టివి.తిరుపతిరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 460.00
విజయనగరం	రూ. 464.00
శ్రీకాకుళం	రూ. 464.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,000–00
బంగారం(22సి. 10గ్రా.)	55,000–00
వెండి (కిలో)	79,500–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹123	₹216	₹ 226

ఆశ్రమంలో చేరికకు ఆసక్తి

- 47 ఆశ్రమ పాఠశాలల్లో 1822 మంది విద్యార్థుల చేరిక
- 8,927 మందికి ఆశ్రమ విద్య
- సీట్ల కోసం స్పందనకు వస్తున్న వినతులు
- నాడు – నేడుతో కార్పొరేట్ తరహాలో హంగులు
- డిజిటల్ విద్యా బోధనకు శ్రీకారం



ఈ ఫోటోలో కనిపిస్తున్న విద్యార్థుల పేర్లు కృతిక, దేవీ. ఐదోతరగతిలో చదువు మానేసి డ్రాపౌట్ అయ్యారు. స్వగ్రామం వీరఘట్టం మండలం కుంబిడి ఇచ్ఛాపురం. వీరు చదువులు మానేసి కొండపోడు పనులకు తల్లిదండ్రులతో కలసి వెళ్లేవారు. ప్రభుత్వం పాఠశాలలకు నాడు - నేడు పనులతో కల్పిస్తున్న మౌలిక వసతులతో పాటు అమ్మ ఒడి, జేవీకే కిట్లు వంటివి ఇస్తుండడంతో మళ్లీ చదువుకోవడానికి ముందుకు వచ్చారు. దీంతో సీతంపేట ఏజెన్సీలోని హడ్డుబంగి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో అధికారులు చేర్పించారు.



ప్రార్థన చేస్తున్న హడ్డుబంగి విద్యార్థినులు

శ్రీరాములుగూడకు చెందిన మరో ఇద్దరు విద్యార్థులు ఎస్.నందిని, ఎస్.రోజాలది ఇదే పరిస్థితి. వీరు కూడా ఇక్కడి పాఠశాలలో చేరారు. ఈతమానుగూడకు చెందిన సవర జ్యోతి, తేజాలను సామరెల్లి ఆశ్రమపాఠశాలలో చేర్పించారు. ఇలా చెప్పుకుంటూ పోతే గతేదాదితో పోలిస్తే ఈ సంవత్సరం ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో ప్రవేశాల సంఖ్య గణనీయంగా పెరిగింది. విద్యార్థులు చదువుకోవడానికి ముందుకు వస్తున్నారు.

సీతంపేట: గతంలో తల్లిదండ్రులతో కలసి కొండపోడు పనులు, పశువుల కాపలాకు వెళ్లిన గిరిజన విద్యార్థులు ఇప్పుడు పాఠశాలల బాట పడుతున్నారు. ప్రభుత్వం గిరిజన సంక్షేమ విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో గిరిజనులు తమ పిల్లలను ఆశ్రమ పాఠశాలల్లో చేర్పించేందుకు మొగ్గు చూపుతున్నారు. బోధనతో పాటు విద్యార్థులకు సరైన వసతులు కల్పించి అక్కడే రుచికరమైన భోజనం అందిస్తూ క్రమశిక్షణ గల విద్యనందించడంతో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో గిరిజన విద్యార్థుల చేరికలు పెరిగాయి. ఇది వరకే చదివిన విద్యార్థులు తమ చదువులు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే వీరికి రెన్యువల్ చేశారు. గతంలో డ్రాపౌట్లు అయిన పలువురు విద్యార్థులు ఇప్పుడు మళ్లీ చేరుతున్నారు. సీతంపేట, పార్వతీపురం మన్యం ఐటీడీఏల పరిధిలో మొత్తం 47 గిరిజన ఆశ్రమ పాఠశాలలున్నాయి. వీటిలో గిరిజన బాలికలకు 18, బాలురకు 29 ఆశ్రమ పాఠశాలలున్నాయి. వీటిలో 3 నుంచి 10 తరగతులు నిర్వహిస్తున్నారు. ఇది వరకే చదువులు కొనసాగిస్తున్న వారు 7,105 మంది విద్యార్థులు కాగా, కొత్తగా 1822 మంది విద్యార్థులు చేరారు. మొత్తం 8,927 మంది చదువుతున్నారు. మనబడి నాడు – నేడులో భాగంగా మరుగుదొడ్లు, భవనాలు వంటివి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టారు. పాఠశాలల్లో బోధనా సిబ్బంది కూడా ఉన్నారు. దీంతో ఆశ్రమ పాఠశాలల్లో మంచి విద్యను అందిస్తున్నారు. ఇటీవల కాలంలో డిజిటల్ విద్య అందుతుండంతో విద్యార్థులు చేరడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ముఖ్యంగా ప్రతీ సోమవారం ఐటీడీఏలో జరిగే గిరిజన స్పందనకు కూడా మాకు పాఠశాలల్లో సీట్లు ఇప్పించాలని వినతులు వస్తున్నాయి. అధికారులు స్పందించి పాఠశాలల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు.



మెనూకు క్యూలో నిల్చున్న విద్యార్థులు



సీతంపేట బాలికల ఆశ్రమ పాఠశాలలో డిజిటల్ తరగతులు

కార్పొరేట్‌ను తలదన్నేలా...



ఆశ్రమ పాఠశాలల్లో కార్పొరేట్ తరహాలో గిరిజన విద్య అందించడం జరుగుతుంది. గతంతో పోలిస్తే గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ప్రవేశాలు పెరిగాయి. అడిగిన వారందరికీ సీట్లు ఇప్పిస్తున్నాం. జగనన్న విద్యాకిట్లు, పాఠ్యపుస్తకాలు వంటివి పంపిణీ జరిగింది. ఎటువంటి సమస్య ఉన్నా వెంటనే స్పందిస్తున్నాం. తరగతులు పకడ్బందీగా నిర్వహించడం జరుగుతుంది. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.

– శ్రీనివాసరావు, గిరిజన సంక్షేమశాఖ డీడీ

సీట్ల కోసం డిమాండ్



మా పాఠశాలలో 3 నుంచి 10 తరగతుల వరకు 600లకు పైగా విద్యార్థులు చదువుతున్నారు. తమ పిల్లలకు సీట్లు ఇప్పించాలని ఎక్కువ మంది తల్లిదండ్రులు ఇంకా వస్తున్నారు. వచ్చిన వారికి ఖాళీలు ఉన్న మేరకు సీట్లు కేటాయించాం. అన్ని వసతులు పూర్తి స్థాయిలో ఉన్నాయి.

– బి.ఉమావాణి, హెచ్‌ఎం,హడ్డుబంగి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

- మేళాలో పాల్గొన్న 17 కంపెనీల ప్రతినిధులు
- భారీగా పాల్గొన్న యువత
- నైపుణ్యతను బట్టి ఉద్యోగ అవకాశాలు
- ఎంపీ బెల్లాన, ఎమ్మెల్సీ పెనుమత్స



స్కిల్ డవలప్‌మెంట్‌లో శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్సీ పెనుమత్స తదితరులు



సమావేశంలో పాల్గొన్న నిరుద్యోగ యువతీ యువకులు, వివిధ కంపెనీల ప్రతినిధులు

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో శుక్రవారం జరిగిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. మేళాకు 960 మంది యువత హాజరు కాగా, తొలి విడతలో 367 మందికి ఎంపిక చేశారు. రెండో విడతలో మరో 120 మందిని ఎంపిక చేయనున్నట్టు కంపెనీల ప్రతినిధులు తెలిపారు. మేళాలో 17 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ముందుగా కార్యక్రమాన్ని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణరాజు జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు. అనంతరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ స్థానికంగా ఉన్న యువతీ యువకులకు 75 శాతం వరకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనతో ఉన్నారని ఆ విధంగానే రాష్ట్ర వ్యాప్తంగా విద్యా విధానంలో పెనుమార్పులు తీసుకువచ్చారన్నారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సహాయ సహకారాలతో కొద్ది సంవత్సరాలుగా మెగా జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నారన్నారు. తొలిసారిగా క్రియేటివ్ ఫీల్డ్(సినిమా రంగం) నుంచి ప్రతినిధులు రావడం సంతోషదగ్గ విషయమన్నారు. ఎమ్మెల్యే సురేష్ బాబు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా జాబ్‌మేళాలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. అనంతరం స్కిల్ డవలప్‌మెంట్‌లో శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. జాబ్‌మేళాలో అపోలో ఫార్మసీ, తోషిబా ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం, టీసీఎల్ అండ్ భారత్ ఎఫ్‌ఐహెచ్, రాండ్ స్టాండ్, డిక్షన్ టెక్నాలజీస్, నవత రోడ్డు ట్రాన్స్‌పోర్టు, ముత్తూట్ ఫైనాన్స్, స్మార్ట్ సర్వీసెస్, వైఎస్‌కే ఇన్ఫోటెక్, ఆర్ అండ్‌ఆర్ ఎక్స్‌ట్రీం సొల్యూషన్, అల్ట్రాటెక్ సిమెంట్ లిమిటెడ్, సునైన క్రియేషన్స్, అరబిందో ఫార్మా లిమిటెడ్, డెక్కన్ ఫైన్ కెమికల్స్ ప్రైవేటు లిమిటెడ్ తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు బూడి వెంకటరావు, ఎంపీటీసీలు మండల సూర్యకళ, రేగలత, పురిటిపెంట ఉప సర్పంచ్ మండల సురేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, సర్పంచ్‌లు బెల్లాన త్రినాధరావు, కడుపుట్ల పైడిపునాయుడు, రేగ సురేష్, ఎంపీడీవో కిశోర్ కుమార్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మన్‌ను పరామర్శించిన విజయసాయిరెడ్డి



నర్సింగరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విజయసాయిరెడ్డి

- మజ్జి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు ఓదార్చిన రాజ్యసభ సభ్యుడు
- నర్సింగరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి

విజయనగరం: ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావును రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జాతీయ కార్యదర్శి విజయసాయిరెడ్డి శుక్రవారం పరామర్శించారు. మజ్జి శ్రీనివాసరావు తండ్రి మజ్జి నర్సింగరావు గురువారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందిన విషయం విదితమే. ఈ మేరకు శుక్రవారం ప్రదీప్‌నగర్‌లోని మజ్జి శ్రీనివాసరావు ఇంటికి చేరుకున్న విజయసాయిరెడ్డి నర్సింగరావు చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, కుంభా రవిబాబు, ఎస్పీ దీపికా పాటిల్, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి అవనాపు విక్రమ్, వైఎస్సార్‌సీపీ జీసీఎస్ ఇన్‌చార్జి హర్షవర్ధన్‌రెడ్డితో పాటు పార్టీ నాయకులు గోపినాథ్ రెడ్డి, కేవీ సూర్యనారాయణరాజు, పార్టీ అభిమానులు పరామర్శించిన వారిలో ఉన్నారు.



మజ్జి నర్సింగరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



ఎస్పీ దీపిక పాటిల్

పొరపాటున టిన్నర్ తాగి వ్యక్తి మృతి

విజయనగరం క్రైమ్: పొరపాటున మంచినీరనుకుని టిన్నర్ తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి రూరల్ పోలీసులు శుక్రవారం అందించిన వివరాలిలా ఉన్నాయి. గుర్ల మండలానికి చెందిన కళ్యాణపు రమణ (38) తాపీ పని చేస్తుంటాడు. యథావిధిగా గురువారం విధి నిర్వహణకు వచ్చి పనులు చేస్తుండగా దాహం వేయడంతో ఎదురుగా ఉన్న సైట్‌లోకి వెళ్లి అక్కడ బాటిల్ కనపడడంతో టిన్నర్ అని తెలుసుకోక, మంచినీరనుకుని పొరపాటున తాగేశాడు. వెంటనే వాంతులు చేసుకున్నాడు. ఆస్పత్రిలో చేరాడు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి ఒంటిగంట ప్రాంతంలో మృతి చెందాడు. మృతుని భార్య రామయమ్మ ఫిర్యాదు మేరకు ఉమెన్ హెచ్‌సీ లక్ష్మీరాజ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ పేరిట మోసం చేసిన వ్యక్తిపై కేసు

కురుపాం: మండలంలోని గుమ్మ గ్రామానికి చెందిన కొనిస అభిషేక్ ప్రేమ పేరుతో ఓ గిరిజన వ్యాయామ ఉపాధ్యాయురాలిని మోసగించిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, కురుపాం ఎస్‌ఐ సీహెచ్ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఓ వ్యాయామ ఉపాధ్యాయురాలిని పెళ్లి చేసుకుంటానని నమ్మించిన అభిషేక్ తరువాత ముఖం చాటేశాడని పేర్కొన్నారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాలకొండ డీఎస్పీ కృష్ణారావు, ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి



రైల్వే ట్రాక్ మధ్యలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బొండపల్లి: మండలంలోని గొట్లాం గ్రామ సమీపంలో రైల్వే ట్రాక్ మధ్యలో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెంది ఉండడాన్ని స్థానికులు శుక్రవారం సాయంత్రం గుర్తించారు. రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని విజయనగరం రైల్వే సీఐ వెంకటరావు, ఎస్‌ఐ రవివర్మ, గజపతినగరం సీఐ ఎల్.అప్పలనాయుడు, బొండపల్లి ఎస్‌ఐ రవి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుని వయసు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉంటుందని, మృతుని ముఖ భాగం పూర్తిగా గుర్తు పట్టలేని విధంగా ఉండడంతో పాటు ఒక చేయి తెగిపడి ట్రాక్ వెలుపల పడి ఉన్నట్టు గుర్తించినట్టు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుని శరీరంపై ఇంకెక్కడ గాయాలు లేకపోవడంతో అనుమానస్పద మృతితో పాటు గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు కూడా లభ్యం కాలేదని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం విజయనగరంలోని కేంద్ర సర్వజన ఆస్పత్రికి తరలిస్తున్నట్టు పేర్కొన్నారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు విజయనగరం, బొబ్బిలి రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేల బావిలో దిగి వ్యక్తి మృతి

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి వస్త్రపురి కాలనీకి చెందిన శనపతి శంకరరావు (43) మృతదేహం గోపాలపురం వెళ్లేదారిలోని నేలబావిలో శుక్రవారం లభ్యమైంది. దీనికి సంబంధించి ఎస్‌ఐ వై.రవికిరణ్ తెలిపిన వివరాలు.. వస్త్రపురి కాలనీలో నివాసం ఉంటున్న శంకరరావు స్థానిక వాసవీ జ్యూట్ మిల్లులో కూలీగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 12న ఫ్యాక్టరీకి అని ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అప్పటి నుంచి ఇంటికి రాకపోవడంతో డోలపేటలోని తన సోదరుల ఇంటికి వెళ్లి ఉంటాడని అనుకుని అక్కడకు ఫోన్ చేసిన భార్య రహీస్‌కు ఇక్కడకు రాలేదని చెప్పారు. ఇంతలో గోపాలపురం వైపు వెళ్తున్న వారు బావిలో తేలియాడుతున్న మృతదేహాన్ని చూసి స్థానికులకు సమాచారం అందించారు. బావి వద్దకు చేరుకుని పరిశీలించి శంకరరావు మృతదేహంగా గుర్తించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బావి ఒడ్డున దుస్తులు ఉండడాన్ని బట్టి శంకరరావు స్నానానికి బావిలోకి దిగి ప్రమాదవశాత్తు మృతి చెంది ఉంటాడని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

గడువులోగా ఆరోగ్య కేంద్రాలు అప్పజెప్పాలి

పార్వతీపురం: జిల్లాలో నూతనంగా నిర్మిస్తున్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లను వచ్చే నెల 15 లోగా పూర్తిచేసి అప్పగించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి అన్నారు. ప్రాధాన్యతా భవనాలు, ఆడుదాం ఆంధ్రా టోర్నమెంట్, ఎన్‌సీడీ – సీడీ సర్వే, జగనన్న విద్యా కానుక కిట్‌ల పంపిణీ, నాడు – నేడు, జగనన్నకు చెబుదాం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రాధాన్యతా భవనాల నిర్మాణాలను ఆయా లక్ష్యాలను పది రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థుల అందరికీ అందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వెనుకబడిన ప్రాంతాల్లోని పాఠశాలల్లోని, అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు ప్రత్యేక దృష్టితో బరువు తక్కువ ఉన్న, రక్తలేమి కేసులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవింద రావు, పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారులు సి.విష్ణు చరణ్, కల్పనా కుమారి, జిల్లా రెవెన్యూ అధికారి జల్లేపల్లి వెంకటరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.బగాది జగన్నాధరావు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రామ చంద్రరావు, డీఈవో ఎస్.ప్రేమ్‌కుమార్, ఐసీడీఎస్ పీడీ కేతిరెడ్డి విజయగౌరీ, జిల్లా స్పోర్ట్స్ అభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, ముఖ్య ప్రణాళికా అధికారి పి.వీర రాజు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నిషాంత్‌కుమార్, ఇతర అధికారులు

మరోసారి గ్రంథాలయ ఉద్యమానికి అడుగులు

- 16న విజయవాడలో గ్రంథాలయ మహాసభలు

విజయనగరం అర్బన్: పిల్లల్లో పఠనాసక్తిని పెంచేందుకు మరోసారి గ్రంథాయల ఉద్యమాన్ని చేపట్టడానికి సిద్ధమవుతున్నట్టు గ్రంథాలయ ఉద్యమ కార్యకర్త నారాయణ వేణు పేర్కొన్నారు. విజయవాడలో ఈ నెల 16న జరగనున్న గ్రంథాలయ మహాసభల వాల్‌పోస్టర్లను శుక్రవారం గురజాడ స్వగృహంలో విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత స్థాయిలో పిల్లలను పుస్తకాలను అధ్యయనం చేసేటట్లు కొంతమంది పని చేస్తున్నారన్నారు. అందులో ఈ జిల్లాలోనే ఉపాధ్యాయుడు జీఎస్‌చలం, చీపురుపల్లికి చెందిన రెడ్డి రమణ ఉన్నారని అన్నారు. ఇటువంటి వ్యక్తులే కాకుండా మరికొంతమంది సామాజిక కార్యకర్తలు తమకి తోచిన విధంగా పిల్లల్లో చదువు పట్ల ప్రేరణ కలిగిస్తున్నారన్నారు. అటువంటి వారందరినీ కలుపుకుంటూ ఓ సామాజిక ఉద్యమంగా ఈ గ్రంథాలయోద్యమాన్ని చేపట్టాలని భావిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలో భవిష్యత్ కార్యాచరణకి సంబంధించి ఓ రూపం ఇవ్వనున్నట్లు తెలిపారు. గ్రంథాలయ పరిరక్షణ కమిటీ నాయకులు, న్యాయవాది ఎస్‌ఎస్‌ఎస్‌వీఆర్ రాజు మాట్లాడుతూ పిల్లల్లో సాహిత్యాన్ని చదవడం పట్ల ఆసక్తిని పెంచాల్సిన అవసరం ప్రస్తుత దశలో ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో రచయిత జీఎస్ చలం, సామాజిక కార్యకర్త అబ్దుల్ రవూఫ్, దయానిధి, జగన్నాధస్వామి, పాత్రికేయుడు వీఎంకే లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయ మహాసభ పోస్టర్‌ను విడుదల చేసిన గ్రంథాలయ ప్రియులు